ntnews.com
నమస్తే తెలంగాణ

# ప్రజల మాట ప్రగతి బాట

## మూడు గంటలైతే మునుగుడే



రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 3 గంటల కరెంట్ అయితే రైతులు నిండా మునగక తప్పదు. సోయి ఉండి మాట్లాడుతున్నారో.. సోయి తప్పి మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. 10హెచ్‌పీ మోటర్లు అంటే అయ్యే పని కాదు. రైతులను ఆగం చేసుడు తప్ప మరేం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇట్లనే చేసింది. రోజుకు రెండు మూడు గంటలు కరెంట్ ఇవ్వడంతో వ్యవసాయంతోపాటు చిన్న పరిశ్రమలు సైతం మూతపడ్డాయి. సీఎం కేసీఆర్ దయతో తిరిగి పూర్తిగా కోలుకున్నాయి. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాదని కాంగ్రెస్ పార్టీని ఎట్టి పరిస్థితిల్లోనూ నమ్మబోను. ఆనాడు రైతులను అరిగోస పెట్టిన సంగతి ఎవరూ మరువలేదు.

–గోనె నాగిరెడ్డి, రైతు, సత్యనారాయణపురం, ఖమ్మం రూరల్

## పాత పద్ధతి అంటే పైరవీలు



గతంలో రెవెన్యూ కార్యాలయానికి పోవాలంటేనే హడలిపోయేవాళ్లం. కనీసం పహాణీ తీసుకోవాలంటే పైరవీకారులను పట్టుకోవాల్సి ఉంది. ఒకరి పేరుపై నుంచి మరొకరికి భూమి బదలాయింపు చేసుకోవాలంటే నానా యాతనపడ్డాం. కానీ.. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెవెన్యూ విషయంలో చాలా మార్పులు వచ్చాయి. పట్టా బుక్ లేని ప్రతి ఒక్కరికి పాస్ పుస్తకం ఉచితంగానే ఇచ్చారు. భూమి వివరాలను మొత్తం ధరణిలోకి తీసుకురావడంతో చాలా తేలికైంది. నాభూమి వివరాలు చూసుకోవాంటే రెవెన్యూ కార్యాలయానికి పోవాల్సిన పని లేకుండా పోయింది. సెల్‌ఫోన్‌లోనే చూసుకునే అవకాశం కలిగింది. ఇంతమంచి ధరణి విధానం తీసివేస్తామనడం సరికాదు.


–బుర్రా మహేశ్, రైతు, గుర్రాలపాడు, ఖమ్మం రూరల్

## కాంగ్రెస్ అంటేనే కరెంట్ కోతలు



కాంగ్రెస్ అంటేనే ప్రతి ఒక్కరికి కరెంట్ కోతలు గుర్తుకొస్తాయి. గ్రానైట్ మొదలుకొని వ్యవసాయ అనుబంధ రంగాలు సైతం గతంలో అనేక ఇబ్బందుపడ్డాయి. వచ్చీరాని కరెంట్‌తో రైతులు తీవ్ర ఇబ్బందు పడ్డారు. తెలంగాణ రావడం, సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణకు కొత్త వెలుగులు వచ్చాయి. ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల కరెంట్ ఇచ్చాడు. ఇలాంటి పరిస్థితిలో మళ్లీ కాంగ్రెస్ నాయకులు కరెంట్‌పై పూటకో మాట మాట్లాడుతున్నారు. వాళ్ల మాటలను రైతులు, ప్రజలు వింటున్నారు. రాష్ట్రంలో ఇంతమంచి కరెంట్ ఇస్తున్న ప్రభుత్వాన్ని వదులుకునే ప్రసక్తే లేదు. మూడు గంటల కరెంట్‌పై మాట్లాడిన వారికి పది రోజుల్లో రైతులు తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

–నాశబోయిన కనకయ్య, అడ్తీదారుడు, నాయుడుపేట



# భూమాత వస్తే భూ బకాసురులు వస్తరు!

- ధరణితోనే భూముల భద్రత.. భూ యజమానులకు భరోసా
- మూడు గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా తడవదు

**10 హెచ్‌పీ మోటర్లు వద్దు.. కరెంట్ కోతలు వద్దు..**
**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బతుకు అంధకారమే..**
**బీఆర్ఎస్ పక్షాన నిలుస్తామంటూ తేల్చి చెప్తున్న రైతాంగం**

ఖమ్మం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పాలన అంటేనే దళారుల రాజ్యం.. ఆ పార్టీ నేతలే దళారుల అవతారం ఎత్తుతారు. నీకు ఇందిరమ్మ ఇల్లు కావాలన్నా, పింఛను కావాలన్నా.. వారి చేయితడపాల్సిందే. ఏ ప్రభుత్వం పథకం కొత్తగా వచ్చినా వాళ్లదే రాజ్యం.. భూకబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు రాజ్యమేలిన రాజ్యం కాంగ్రెస్ రాజ్యమే. కాంగ్రెస్ పాలనలో భూ సమస్యలకు పరిష్కారం చూపే నాథుడే ఉండేవాడు కాదు. బూజు పట్టి, చెదలు పట్టి ఉన్న రెవెన్యూ చట్టాల్లో లొసుగులు అధికారుల పాలిట బంగారు గుడ్లు పెట్టే బాతులు. అధికారి చెప్పిన అమౌంట్ సెట్ చేస్తే చాలు.. ఎవరి భూమి ఎవరి పేరునైనా రాసి ఇస్తారు.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సర్వే నంబర్లకు 'బై..' కల్చర్ పుట్టుకొచ్చింది. భూబకాసరుల భూకబ్జాలకు హద్దు పద్దూ ఉండేది కాదు. ఒక రైతు అవసరమొచ్చి భూమిని అమ్మితే, కొన్న వ్యక్తి రిజిస్ట్రేషన్ పెద్ద ప్రహసనం. రిజిస్ట్రేషన్ కోసం ఏళ్ల పాటు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సివచ్చేది. ఈ సమస్యలన్నింటినీ అర్థం చేసుకున్న కేసీఆర్ తెలంగాణ వచ్చిన తర్వాత సీఎంగా భూరికార్డుల ప్రక్షాళన చేశారు. కొత్త రెవెన్యూ చట్టాలు తెచ్చారు. భూములు, భూరికార్డుల భద్రత కోసం 'ధరణి' పోర్టల్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు రైతు భౌతికంగా రెవెన్యూ కార్యాలయంలో హాజరైతే తప్ప వేరొకరి పేరుపై రిజిస్ట్రేషన్ చేసే అవకాశం లేని పటిష్ట వ్యవస్థను తీసుకొచ్చారు.

### మూడు గంటల కరెంట్ వద్దు..

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతలు రైతుబంధును బంగాళాఖాతాలో కలుపుతామంటున్నారు. పంటలకు కేవలం మూడు కరెంట్ ఇస్తామంటున్నారు. రైతులు 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలంటున్నారు. ఇలాంటి అతీగతి లేని మాటలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల పాటు కరెంట్ ఇస్తుంటే, కేవలం మూడు గంటలు కరెంట్ సరిపోతుందని వ్యాఖ్యలు చేయడంపై మండిపడుతున్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్, భూముల భద్రతకు ధరణి అవసరమని తేల్చి చెప్తున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తామంటున్నారు.

## పైరవీలు తప్పినయి



గతంలో భూములు పట్టా చేయించాలంటే పైరవీలు చేయాల్సి వచ్చేది. కానీ.. కేసీఆర్ వచ్చిన తర్వాత పాస్ పుస్తకాలు ధరణిలో అవుతున్నాయి. పైరవీకారులు, లంచాలు లేకుండా పనులు అవుతున్నాయి. రైతు సొంతంగా మీ సేవకు పోయి స్లాట్ బుకింగ్ చేసుకుంటే పని అయిపోతుంది. ఇంటికి పోస్టులో పాస్ పుస్తకాలు వస్తున్నాయి. గతంలో ఏళ్ల తరబడి తిరిగినా కాకపోయేది. కానీ.. పనులు ఇప్పుడు సులువుగా అవుతున్నాయి. ధరణితో అందరి భూములకు భద్రత వచ్చింది. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణితో పేద, మధ్య తరగతి రైతులకు, వారి భూములకు భద్రత కలిగింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు అయిపోతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ధరణి ఉండాల్సిందే.

–కనకం సైదులు, రైతు, గుర్వాయిగూడెం, కూసుమంచి మండలం

## కోతలతో కష్టాలు పడ్డాం



రాత్రుళ్లు పొలాలకు, చేలకు నీరు పెట్టడానికి పోయి అక్కడే పడుకునేటోళ్లం. ఉన్న కొద్దిసేపు కరెంట్‌తో ఒకటి, రెండు మడులు తడిసేవి. మిగిలిన పంటకు నీరులేక ఇబ్బంది కలిగేది. కానీ.. ఇప్పుడు బావులు, బోర్లలో నీరు పుష్కలంగా ఉంది. నీరు బాగా దొరుకుతుంది. రెండు పంటలు పడుతున్నాయి. కోతలు లేకుండా పూర్తిగా కరెంట్ అందడంతో తోట, పొలం వేశాను. సీఎం కేఆర్ వచ్చిన తర్వాత కరెంట్ కష్టాలు తీరాయి. సాగునీరు కూడా బాగా అందుతుంది. గతంలో వర్షాధార పంటలు వేసే వాళ్లం. కానీ.. ఇప్పుడు యాసంగి, వానకాలం పొలాలు వేసుకొంటూ మిర్చి తోటలు వేస్తున్నాం. 24 గంటల కరెంట్ ఉండాలి. లేకపోతే మళ్లీ కరెంట్ కష్టాలు వస్తే పంటలు పండించుకోలేం.

–శ్రీను, రైతు, బండమీదతండా, కూసుమంచి మండలం

## కరెంట్ బాధలు తీరినయ్



గతంలో కరెంట్ కోతలతో చాలా ఇబ్బందులు పడ్డాం. రాత్రుళ్లు జాగారం చేసినం. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో అలాంటి ఇబ్బంది లేకుండా 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. సాగునీరు కూడా బాగుండడంతో రెండు పంటలు పండుతున్నాయి. గతంలో రాత్రి కరెంట్‌తో అక్కడే ఉండే వాళ్లం. పొలాలకు పోవాలంటే భయం అయ్యేది. రాత్రిపూట కరెంట్ కష్టాలు కేసీఆర్ సారు వచ్చినాక తీరినయ్. ఉచితంగా 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటు పండించుకుంటున్నారు. నేను వేసిన పొలం, తోట బాగుంది. పోయిన ఏడాది కూడా మంచి లాభంగా వ్యవసాయం సాగింది. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ కావాల్సిందే. 10హెచ్‌పీ మోటర్లు మేము కొనలేం.. అంత భారం మోయలేం.

–ఆడెపు రాజయ్య, రైతు, కూసుమంచి

## ధరణి పోతే రైతులకు గోసే



కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తామంటున్నారు. ధరణి వచ్చిన తర్వాత ఒకే దగ్గర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయిపోతున్నాయి. రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరిగే తిప్పలు తప్పాయి. ధరణి రద్దు చేస్తే రైతులు తిరిగి రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ గతంలో లాగా చెప్పులరిగేలా తిరగాలి. వీఆర్వోలు, పట్వారీల వెంబడి తిరగాలి. అయినా పని కాదు. ఇప్పుడు కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయ్యాక అవస్థలు పోయాయి. కాంగ్రెస్ సర్కారు వస్తే రైతులకు కష్టాలు మళ్లీ మొదలవుతాయి. రైతులు బ్రోకర్లు, పటేల్, పట్వారీల వెంట తిరిగి లంచాలు ఇవ్వాల్సి వస్తుంది. ఇప్పుడు కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా జీవిస్తున్నారు.

– బూరుగు ఇసాక్, రైతు, కందుకూరు, వేంసూరు మండలం

## పసిడి పంటలు పండిస్తున్నాం



24 గంటలు ఉచిత కరెంట్‌తో పసిడి పంటలు పండిస్తున్నాం. కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద కనీస అవగాహన లేదు. చిన్న, సన్నకారు రైతులు 10 హెచ్‌పీ మోటర్లు వాడరు అనే విషయాన్ని గుర్తించాలే. రేవంత్‌రెడ్డి అలాంటి పనికి మాలిన మాటలు మాట్లాడటం సరికాదు. నాకు 25 ఎకరాల భూమి ఉంది. ఇందులో రెండు, మూడు పంటలు సాగు చేస్తాను. రెండు, మూడు రోజులకోసారి నీరు పారిస్తా. నాకు 5 హెచ్‌పీ మోటరుతో పంటలకు సరిపడా నీరందిస్తున్నా. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటలు కరెంట్ రైతులకు ఉచితంగా ఇస్తుంటే కాంగ్రెసోళ్లు ఓట్ల కోసం ఇలా రైతులతో రాజకీయం చేస్తున్నారు. అందుకే 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసే కేసీఆర్ ప్రభుత్వానికే అండగా ఉంటాం.

– చల్లా రవీందర్‌రెడ్డి, యువరైతు, కందుకూరు, వేంసూరు మండలం

## మూడు గంటలు కరెంట్ సరిపోదు



మూడు గంటలు కరెంట్‌తో మా పొలాల సాగు కావు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు మూడు గంటల కరెంట్‌తో రైతులు బాగుపడరు. మాకు మూడు ఎకరాల పొలం ఉంది. ఇప్పుడున్న ప్రభుత్వం 24 గంటలు కరెంట్ ఇవ్వడంతో 5 హెచ్‌పీ మోటర్లను వాడుతున్నాం. కాంగ్రెస్ మూడు గంటల కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ మోటర్లతో పెట్టిస్తామని చెబుతున్నారు. రైతులందరూ ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లను చేస్తే ట్రాన్స్‌పార్మర్ పేలి పోయి సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ కాలిపోతాయి. రైతులతో పాటు, ఇళ్లలో కూడా కరెంట్ కష్టాలు మొదలవుతాయి. మా రైతులకు సర్కారు ఇచ్చే ట్రాన్స్‌ఫార్మర్లు 25 హెచ్‌పీవి ఉంటాయి. ఇప్పుడు తెలంగాణ సర్కారు 24 గంటలు కరెంట్ ఇస్తుంది. పంటలు మంచిగా పడుతున్నాయి. దిగుబడి మంచిగా వస్తుంది.

– జుబ్బూరి నాగరాజు, రైతు, కందుకూరు, వేంసూరు మండలం